కుక్కలున్నాయ్.. పిక్కలు జాగ్రత్త

- నగరంలోని వీధుల్లో గ్రామ సింహాల స్వైరవిహారం
- వరుస దాడులతో బెంబేలెత్తుతున్న ప్రజలు



నగరంలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

సీటీఆర్‌ఐ: రాజమహేంద్రవరంలోని 48వ డివిజన్ సంజీవనగర్‌లో అంగన్‌వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాల పక్కపక్కనే ఉంటాయి. బుధవారం సాయంత్రం పాఠశాల ముగిశాక విద్యార్థులంతా ఇంటికి బయలుదేరారు. ఇంతలో ఓ కుక్కల గుంపు వారి మీదకి దూసుకురావడంతో చిన్నారులంతా హడలిపోయారు. తప్పించుకునే క్రమంలో కొందరు రోడ్డుపై పడిపోయారు. ఇంతలో అటుగా వెళుతున్న కొందరు కుక్కల్ని తరమడంతో ప్రమాదం తప్పింది. ఇలాంటి ఘటనలు రాజమహేంద్రవరం నగరంలో నిత్యకృత్యమైపోయింది. అడ్డూఅదుపూ లేకుండా పెరిగిపోతున్న వీధి కుక్కలను నియంత్రించడానికి అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

రోజురోజుకీ సమస్య తీవ్రం

ప్రస్తుతం రాజమహేంద్రవరం నగరంలో 25 వేలకి పైగా కుక్కలు ఉన్నట్లు నగరపాలక సంస్థ ఆరోగ్య విభాగం అధికారులు చెబుతున్నారు. అయితే వాస్తవానికి ఆ సంఖ్య మరింత ఎక్కువ ఉండొచ్చని అంచనా. నగరంలోని వీధివీధిలో పదుల సంఖ్యలో కుక్కలు తిష్ట వేసుకుని కూర్చున్నాయి. ప్రధానంగా బొమ్మూరు, నేతాజీనగర్, బాలాజీపేట, జీవీ నగర్, దానవాయిపేట, గాంధీపురం, దేవీచౌక్, ఆజాద్ చౌక్ ప్రాంతాల్లో కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. రాత్రి పగలు అన్న తేడా లేకుండా పాదచారులు, వాహనదారులు అన్న బేధం చూపించకుండా దొరికినవాళ్లను దొరికినట్లుగా కరిచేస్తున్నాయి. ప్రధానంగా రాత్రి వేళల్లో విధులు నిర్వహించుకుని ఇళ్లకు వెళ్లేవారు గుంపులుగుంపులుగా తిరిగే కుక్కలను చూసి హడలిపోతున్నారు. మరోవైపు చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా వెళితే కుక్కలు మీద పడి దాడి చేస్తున్నాయి. కేవలం కుక్కల కారణంగానే రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయపడాల్సిన దుస్థితి వచ్చి పడింది. నగరంలో వీధికుక్కల బాధితులు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. నగర శివారు ప్రాంతాల్లో బాధితుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు బాధితులు వస్తున్నారు. ఒక్కో కేంద్రంలో రోజుకు 2 నుంచి 5 వరకూ కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి.

అవునా నిజమా..?

కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక క్వారీ మార్కెట్ వద్ద ఏబీసీ(యాంటీబర్త్ కంట్రోల్) కేంద్రం ఉంది.

ఫోన్ చేస్తే పట్టేసుకుంటారంట

నగరంలో ఎక్కడైనా కుక్కల సమస్య ఎక్కువగా ఉంటే కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్‌రూమ్ 94940 60060 సెల్ నంబర్‌కి ఫోన్ చేస్తే వెంటనే బృందాన్ని పంపించి కుక్కలను పట్టుకుని తీసుకెళతామని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక బృందం వీధి కుక్కలను తీసుకొచ్చి ఇక్కడ రోజూ కనీసం 25 కుక్కలకు యాంటీబర్త్ కంట్రోల్(ఏబీసీ) ఆపరేషన్లు చేస్తున్నట్లుగా కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు. అంటే ఏడాదికి రమారమి 9,000 కుక్కలకు ఆపరేషన్లు జరుగుతున్నట్లు అంచనా.. అయినా నిత్యం వీధికుక్కల స్వైర విహారం కొనసాగుతుందంటే ఆశ్చర్యం కలగక మానదు. ఇదే విషయంపై అధికారులను అడిగితే గతంలో కరోనా సమయంలో మూడేళ్ల పాటు ఏబీసీ ఆపరేషన్లు చేయకపోవడంతో కుక్కల సంఖ్య పెరిగిపోయిందంటున్నారు. ఏబీసీ ఆపరేషన్లు చేస్తున్నా అవి విఫలమవ్వడం కూడా మరో కారణం కావొచ్చని భావిస్తున్నామంటున్నారు. మరోవైపు నగర ప్రజలేమో అసలు కుక్కల్ని పట్టుకున్న దాఖలాలే ఎప్పుడూ లేవని పెదవి విరుస్తున్నారు.

రోజుకి 25 ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం

క్వారీ మార్కెట్ సెంటర్‌లో ఉన్న ఏబీసీ సెంటర్‌లో రోజుకి 25 కుక్కల వరకూ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాం. అంతేకాకుండా కుక్కలను పట్టుకోవడానికి ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశాం. నిత్యం ఈ ప్రక్రియ కొనసాగుతోంది.

– డాక్టర్ వినూత్న, కార్పొరేషన్ ఎంహెచ్‌ఓ, రాజమహేంద్రవరం

కుక్కల బెడద తొలగించాలి



నగరంలో కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయింది. ప్రధానంగా రాత్రి సమయంలో బయటికి వెళ్లి తిరిగి వస్తుంటే వెంబడిస్తున్నాయి. అంతేకాకుండా గుంపులు గుంపులుగా చేరి రాత్రి సమయాల్లో గట్టిగా అరుస్తూ నిద్రాభంగం కలిగిస్తున్నాయి. అధికారులు కుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి.

– చీర్ల సీతారామనాయుడు, హితకారిణి సమాజం పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు

క్లుప్తంగా

కాలుష్యం లేని వాతావరణం అందిద్దాం



స్వచ్ఛవాయు దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న ర్యాలీ

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛమైన గాలి, కాలుష్యం లేని చక్కని వాతావరణం అందించడానికి ప్రజలందరూ నడుం బిగించాలని కమిషనరు కేతన్‌గార్గ్ పిలుపునిచ్చారు. బుధవారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ స్వచ్ఛవాయు దినోత్సవం సందర్భంగా నగరంలోని కంబాలచెరువు జంక్షన్ నుంచి రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వరకూ క్లీన్ ఎయిర్ ఫర్ బ్లూ స్కై నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఈ జి.పాండురంగారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్‌వీ శేషగిరిరావు, ఎమినిటీ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు, శానిటేషన్ సెక్రటరీలు, ఆంధ్ర పేపరు మిల్లు సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.1,08,000 విరాళం



చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న విద్యార్థిని వేద శ్రీసాయి

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడ వరద బాధితుల కోసం నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థిని ముళ్లపూడి వేద శ్రీసాయి తాను పొదుపు చేసుకున్న రూ.1,08,000 ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చింది. తన తల్లిదండ్రులు డాక్టర్ ముళ్లపూడి రాజేంద్రప్రసాద్, డాక్టర్ ముళ్లపూడి సంగీతలతో కలిసి బుధవారం విజయవాడ వెళ్లి సీఎం చంద్రబాబును కలిసి సదరు మొత్తానికి చెక్కును అందజేశారు.

నర్సరీ రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండండి

కడియం: మండలంలో చిరుతపులి సంచరిస్తున్న నేపథ్యంలో నర్సరీ రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. నర్సరీల నుంచి రెండు రోజుల పాటు మొక్కల లోడింగ్‌లు ఆపివేయాలని సూచించారు.

ఘనంగా ప్రపంచ ఊపిరితిత్తుల దినోత్సవం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): కమ్యూనిటీ పారామెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానికంగా ఓ హోటల్‌లో ప్రపంచ ఊపిరితిత్తుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య విజ్ఞాన సదస్సులో సన్ స్టార్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నక్కా సుధాకర్ మాట్లాడుతూ ఊపిరితిత్తుల ఆరోగ్య సంరక్షణకు ధూమపానానికి దూరంగా ఉండటం, వాయు కాలుష్యంపై జాగ్రత్తలు తీసుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వంటివి పాటించాలన్నారు. న్యూరో సర్జన్ డాక్టర్ జమ్ము కోదండరామ్ మాట్లాడుతూ మెదడు సంబంధిత వ్యాధులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించగలిగితే చికిత్స అందించడం సులభమన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రహమాన్‌ఖాన్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, పి.దేవానందం, పి.చిన్ని, మట్టా రమేష్, ఎ.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పాపం పోవాలంటే అఖండ దీపం వెలగాలి



అఖండజ్యోతిని తీసుకెళుతున్న అవినాష్ దేవిచంద్ర, అఘోరిని తదితరులు

సీటీఆర్‌ఐ: పాపం పోవాలంటే అఖండ జ్యోతి వెలగాలని బచ్చు ఫౌండేషన్ చైర్మన్ అవినాష్ దేవి చంద్ర అన్నారు. బుధవారం రాజమండ్రి ఆనం కళాకేంద్రం వద్ద ఉన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి శ్రీతార వారాహి లోకకళ్యాణార్థం సేవాభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అఖండ జ్యోతి పాదయాత్రను ప్రారంభించారు. తిరుపతి లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీ చేయడం మహా అపచారమన్నారు. దానికి ప్రాయశ్చిత్తంగా భారత దేశ యాత్ర చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని పిఠాపురం నుంచి తిరుపతి వరకూ అఖండ జ్యోతితో పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి చేరుకున్న అనంతరం శ్రీవారి పాదాల వద్ద ఈ అఖండ జ్యోతి ఉంచుతామని వివరించారు. అఖండ పాదయాత్రలో అఘోరిని తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం



డీఆర్‌ఓ నరసింహులుకు వినతిపత్రం ఇస్తున్న సంఘ సభ్యులు

సీటీఆర్‌ఐ: దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య అన్నారు. మతం మార్చుకున్న వారిని ఎస్సీ కుల జాబితా నుంచి తొలగించాలని కోరుతూ కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులను కలిసి బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవులను షెడ్యూల్ కులాల్లో చేరిస్తే దాని పరిణామం దళిత హిందూ సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. దీనివల్ల అంబేడ్కర్ చేసిన దీర్ఘకాల పోరాట ఫలితం వృథా అవుతుందని చెప్పారు. మతం మార్చుకున్న క్రైస్తవులకు రిజర్వేషన్ల సౌకర్యం కల్పించడానికి వీలులేదని అనేక సందర్భాల్లో ఉన్నత న్యాయస్థానాలు తీర్పు ఇచ్చాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొటుకుల జాషువా, అర్జరపు రమేష్‌బాబు, ముప్పిడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



విద్యార్థులకు హెల్మెట్లు పంపిణీ చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. జిల్లా కోర్ట్ ఆవరణలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు ×రోడ్డు ప్రమాదాల నివారణ× ×హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతపై నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత పాల్గొని ప్రసంగించారు. హెల్మెట్ ధరించడం శిరసుపై బరువుగా భావించకుండా అది బాధ్యతగా భావించాలని సూచించారు. విద్యార్థులు బాగా చదువుకుని అత్యున్నత స్థాయికి చేరుకోవాలని, ×హార్డ్ వర్క్ నెవర్ ఫెయిల్స్ అనే సూక్తిని గుర్తుంచుకోవాలని చెప్పారు. అతి వేగం ప్రమాదకరమని, ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రాజమహేంద్రవరం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపే విద్యార్థులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. సదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్‌బాబు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు, పొలిటికల్ సైన్స్ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ పి.బాబ్జీ, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు, డిప్యూటీ రీజినల్ హెడ్ డి.రామ్మోహన్‌రావు, సీనియర్ మేనేజర్లు ఎ.హుస్సేన్, టి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు టోల్‌ఫ్రీ నంబర్లపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే సూచించారు. మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో 'నేను మీకు తెలుసా' అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రామచంద్ర 100, 108, 181, 112, 1098, 139, 1930 టోల్‌ఫ్రీ నంబర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. అతిథిగా విచ్చేసిన స్పెషల్ మహిళా జైలు సూపరింటెండెంట్ వసంత మాట్లాడుతూ మహిళలు సమాజంలో శక్తివంతులుగా మారాలని, మనోధైర్యం పెంచుకోవాలని, ఆత్మవిశ్వాసం అలవర్చుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, మోసాల బారిన పడకుండా విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలన్నారు. రిటైర్డ్ అడ్వకేట్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మాజీ అధ్యక్షురాలు బి.పద్మావతి సోషల్ మీడియాలో అమ్మాయిలు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులకు పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ అన్నపూర్ణ, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వరి, మహిళా సాధికారత కోఆర్డినేటర్ డాక్టర్ సురేఖ, టీం సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి



దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



దీన్ దయాళ్ ఉపాధ్యాయకు నివాళులర్పిస్తున్న బొమ్ముల దత్తు తదితరులు

ధవళేశ్వరం: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం ధవళేశ్వరంలో బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ షాజిద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ధవళేశ్వరంలోని లక్ష్మీనరసింహస్వామి శక్తి కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీజేపీ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి పన్నాల లక్ష్మీ సంతోష, బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కందుకూరి మనోజ్‌బాబు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ సంతోషి మాట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జీవిత సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆలోచనలను, ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళతామన్నారు. బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కందుకూరి మనోజ్‌బాబు మాట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ భారతదేశంలో రాజకీయ, సామాజిక రంగాలలో అనుసరణీయమైన వ్యక్తి అన్నారు. బీజేపీ రాజమండ్రి రూరల్ మండలం ప్రధాన కార్యదర్శి కుబేర్ రావు, మైనారిటీ మోర్చా మండల అధ్యక్షులు షేక్ సత్తార్ సాహెబ్, కె.జగన్నాథరావు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సేవే పరమావధి

రాజమహేంద్రవరం రూరల్: దేశ సేవే జీవిత పరమావధిగా, ఏకాత్మతా మానవతా వాదాన్ని ప్రతిపాదించి కార్యకర్తల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన మహోన్నత వ్యక్తి పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అన్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బుధవారం కొంతమూరులో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దత్తు మాట్లాడుతూ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఈ దేశంలో అట్టడుగు స్థాయి వారికి కూడా అభివృద్ధి ఫలాలు అందాలనే సదుద్దేశంతో విశేష సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో మురమళ్ల ఆనందకుమార్, నందు, రూరల్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, రూరల్ నియోజకవర్గ బీజేపీ కోకన్వీనర్ యానాపు ఏసు, కాలెపు సత్య సాయిరాం, జల్లూరి గోపీనాథ్, అడబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకే



జేగురుపాడు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరెడ్డి

కడియం: ఆధునిక వ్యవసాయ సాంకేతిక సమాచారంపై రైతులకు అవగాహన కల్పించడం కోసమే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏడీఏ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారి ద్వారకాదేవి అన్నారు. బుధవారం జేగురుపాడు, మురమండ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు క్షేత్ర స్థాయి సమస్యలకు తక్షణ పరిష్కారం సూచిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగిరెడ్డి సూర్యరామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రైతులంతా సమగ్ర వ్యవసాయం చేయాలి

రాజమహేంద్రవరం రూరల్: రైతులందరూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే సమగ్ర వ్యవసాయం చేయాలని ఏడీఏ డి.శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయాధికారి ఎ.భీమరాజు అన్నారు. పిడింగొయ్యి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాసరెడ్డి ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానశాఖాధికారి డి.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో చెట్ల చుట్టూ బేసిన్ల ఏర్పాటు, ఫారం పాండ్స్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖాధికారి డా.వెంకటరావు, వ్యవసాయాధికారి శాంతాఆలివ్, మాజీ సొసైటీ అధ్యక్షుడు బొప్పన శ్రీనివాస్, మట్టా శ్రీనివాస్, మార్ని వాసుదేవరావు, రైతులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్సు సంబరాలు ప్రారంభం



కొంకుదురులో చెకుముకి పరీక్షలు జరుగుతున్న దృశ్యం



సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో చెకుముకి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: విద్యార్థులలో సైన్సుపై అభిరుచిని పెంపొందించడానికి శాస్త్రీయ ఆలోచనలు కలిగించడానికి చెకుముకి సైన్స్ సంబరాలు ఎంతోగానో దోహదపడతాయని చెకుముకి బిక్కవోలు మండల కన్వీనర్ కొప్పిశెట్టి శ్రీకృష్ణాసాయి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో చెకుముకి సైన్సు సంబరాలను కొంకుదురు ఉన్నత పాఠశాలలో ప్రారంభించినట్టు తెలిపారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో 8, 9, 10 తరగతులు విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నట్టు తెలిపారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలోని పడాల ఈశ్వర్‌రెడ్డి, వలీషా, సత్యనారాయణ, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి చెకుముకి పరీక్షలు నిర్వహించినట్టు చెకుముకి మండల కన్వీనర్ కన్నూరి సతీష్‌బాబు తెలిపారు. బుధవారం సీతానగరం ప్రభుత్వ హైస్కూల్ తోపాటుగా వంగలపూడి, చినకొండేపూడి, రఘుదేవపురం, బొబ్బిల్లంక, మిర్తిపాడుల్లోని జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఐదు ప్రైవేట్ పాఠశాలల్లో చెకుముకి పరీక్ష జరిగాయన్నారు. మండలంలో 527 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారని అన్నారు. ప్రతి స్కూల్ నుంచి 8, 9, పదో తరగతిలలో మొదటి వచ్చిన ముగ్గురుని వచ్చే నెల ఒకటిన జరిగే మండల స్థాయి పోటీలకు హాజరవుతారని చెకుముకి మడల కన్వీనర్ సతీష్‌బాబు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మహిళ మృతి



మృతి చెందిన మహిళ

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని మహిళ మృతి చెందిందని జీఆర్పీ ఎస్ఐ మావుళ్లు బుధవారం తెలిపారు. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ నెం.1 లేడీస్ వెయిటింగ్ హాల్‌లో సుమారు 50 ఏళ్ల వయసున్న మహిళ మృతి చెంది కనిపించిందన్నారు. ఆమె నీలం రంగు మీద పసుపు, ఎరుపు డిజైన్ గల చీర, అదే రంగు జాకెట్ ధరించి ఉందన్నారు. మృతురాలి వద్ద ఈ నెల 22న హైదరాబాద్–పూణే, కలబురిగి–హైదరాబాద్ వరకూ ట్రైన్ టికెట్లు ఉన్నాయన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతురాలి గురించి ఎవరికైనా వివరాలు తెలిస్తే 0883 2442821, 94910 03239 నంబర్లలో సంప్రదించాలన్నారు.

లక్ష్య సాధన దిశగా కృషి చేయాలి



విశ్రాంత చీఫ్ ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ మేడిశెట్టి తిరుమలను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: యువత లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని విశ్రాంత చీఫ్ ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ మేడిశెట్టి తిరుమల అన్నారు. స్థానిక శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ బొమ్మూరు సెంటినియల్ ఆధ్వర్యంలో యూత్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా 'లక్ష్యాన్ని చేరుకోవడం ఎలా' అనే అంశంపై ఆయన మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల మాట్లాడుతూ యువత ప్రణాళిక ప్రకారం చదువుకుంటే విజయం సాధించగలరన్నారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు దగ్గరలో ఉన్న గ్రంథాలయానికి వెళ్లి ప్రముఖుల స్వీయ చరిత్రలు, స్ఫూర్తిదాయక వ్యాసాలు, జనరల్ నాలెడ్జ్ బుక్స్ చదువుతూ ఉండాలన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ కె.రమేష్‌బాబు, సెక్రటరీ రామారావు, కోశాధికారి ఎస్ఎస్ శ్రీరాములు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని బత్తిన రాజేశ్వరి, ఉపాధ్యాయులు డి.రాముడు, బి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్పీ బాలు కాంస్య విగ్రహం పెట్టాలి



గాయకుడు శ్రీనివాసరావును సత్కరిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిత్ మోహన్ మిత్ర సారథ్యంలో రాజమండ్రిలో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహం పెట్టాలని, అప్పుడే బాలుకి సరైన గౌరవం కల్పించినట్లు అవుతుందని పలువురు వక్తలన్నారు. స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్ మోహన్ మిత్ర కళావేదికపై ఎస్పీ బాలు 4వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకుడు గుంటూరి శ్రీనివాసరావుకి ఎస్పీ బాలు అవార్డు అందజేసి సత్కరించారు. అనంతరం జిత్ మోహన్ మిత్ర మాట్లాడుతూ ఎస్పీ బాలు వంటి మహనీయుని విగ్రహం రాజమండ్రిలో ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గుమ్మడి సమర్పణరావు, జె.శివప్రసాద్, కళారత్న పీవీఎస్ కృష్ణారావు, ఏఎస్ ఆనంద్, బి.సీతారామారావు, వి.జగపతి, ముద్రగడ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాంబాబుకు జాతీయ స్థాయి గుర్తింపు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని సీఎల్ సీఆర్ఆర్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పోలుమాటి రాంబాబుకు జాతీయ లేబర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జనరల్, కోర్సు డైరెక్టర్ వీవీ గిరి జాతీయ స్థాయి గుర్తింపు సర్టిఫికెట్ అందజేశారు. నోయిడాలోని వీవీగిరి జాతీయ లేబర్ ఇనిస్టిట్యూట్‌లో వెట్టిచాకిరి కార్మికులు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన సంబంధిత చట్టాలపై ఆయన సమగ్ర అధ్యయనం చేశారు. శిక్షణానంతరం ప్రివెన్షన్ అండ్ ఎలిమినేషన్ ఆఫ్ బాండెడ్ లేబర్ అండ్ చైల్డ్ లేబర్ అనే అంశంపై జాతీయ స్థాయి గుర్తింపు సర్టిఫికెట్‌ను అందుకున్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



ఊలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

బిక్కవోలు: విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని స్థానిక విశ్వ మానవత సంస్థ వ్యవస్థాపకులు అల్లూరి శ్రీనివాస చౌదరి అన్నారు. బుధవారం ఊలపల్లిలోని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మవిశ్వాసం, సంపూర్ణ అభివృద్ధి, ఆరోగ్యం, మాస్టర్‌మైండ్ ఏకాగ్రత, విషయాలు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు మెడిటేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలోని పాఠశాల హెచ్‌ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు గొలుగూరి వెంకటరామారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	35 చిన్నకథకాదు
సూర్యమినీ	ట్రాన్స్‌ఫార్మర్స్–1
సూర్యప్యాలెస్	శివాజీ
స్వామి	సరిపోదా శనివారం
అశోక	గొర్రె పురాణం
శివజ్యోతి	మత్తు వదలరా–2
అనుశ్రీ	మత్తు వదలరా–2
రాజా	మత్తు వదలరా–2
రంభ	హైడ్ అండ్ సీక్, కళింగ
ఊర్వశి	100 క్రోర్స్, కమిటీ కుర్రోళ్ళు
మేనక	జర్నీ, చిక్లెట్స్
కుమారి	డిమోంటీ కాలనీ–2, ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్(గోట్)
అప్సర	సరిపోదా శనివారం
నామవరం	
వీఎస్ మహల్	ఏఆర్‌ఎం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	మత్తు వదలరా–2
కడియం	
వెంకటసూర్య	మత్తు వదలరా–2